నేలకొండపల్లిలో వైద్యశిబిరం

వైద్యశిబిరంలో రోగులను పరిశీలిస్తున్న వైద్యుడు

కూసుమంచి(నేలకొండపల్లి), డిసెంబర్ 8 : పేదల కోసం స్వర్గీయ గంగాధర్ జ్ఞాపకార్థం సీపీఎం ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొల్లు అనుదీప్ అన్నారు. మండల కేంద్రం నేలకొండపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రూ.100 లకే నెలకు సరిపడా బీపీ, షుగర్ మందులు ఇచ్చారు. ఖమ్మం శరత్ మ్యాక్స్ విజన్ ఆసుపత్రి వారితో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రామారావు, నాగేశ్వరరావు, పుష్పలత, తానీష, అనిల్‌కుమార్, విద్యార్థులు, ఎన్‌టీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రెడీమేడ్ దుస్తుల వితరణ

దుస్తులను అందజేస్తున్న జీవీ అకాడమీ యాజమాన్య బాధ్యులు

మధిర, డిసెంబర్ 8 : మధిర పట్టణంలోని జీవీ అకాడమీ స్కూల్ ఆధ్వర్యంలో పేదలకు రెడీమేడ్ దుస్తులను జీవీ అకాడమీ జోనల్ హెడ్ రాజేశ్వరి, మధిర జీవీ అకాడమీ స్కూల్ సిబ్బంది ప్రముఖ సామాజిక సేవకులు, మధిర ఆశమిత్ర లంకా కొండయ్యకు ఆదివారం అందజేశారు. వితరణ చేసిన దుస్తులను మధిర పట్టణంలోని నందిగామ బైపాస్‌రోడ్డులో ఉన్న సంచార జాతుల కుటుంబాలకు అందజేశారు. యాజమాన్యానికి సామాజిక కార్యకర్త కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మధిరలో ఘనంగా సెమీక్రిస్మస్

మహిళలకు దుస్తులను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మధిర, డిసెంబర్ 8 : మధిర పట్టణంలో సెమీక్రిస్మస్ వేడుకలను మున్సిపాలిటీలోని 20వ వార్డునందు సంఘం పాస్టర్ జాన్‌పీటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పేద క్రిస్టియన్ మహిళలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత చేతుల మీదుగా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొండితోక జయాకర్, పాస్టర్ జాన్సన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, డిసెంబర్ 8 : కల్లూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం శంకుస్థాపన చేశారు. కల్లూరు పట్టణంలోని ఎన్ఎస్పీ రోడ్డు, పత్రాప్ అపార్ట్‌మెంట్, పుల్లయ్యబంజర రోడ్డు, ఎల్లంకి ఎస్టేట్, బోడిపల్లెకాలనీలో పలు కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ నరేంద్ర, నాయకులు చంద్రరావు, కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సత్తుపల్లి, డిసెంబర్ 8 : పట్టణంలోని బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972 సంవత్సరంలో చదివిన విద్యార్థులు 52 సంవత్సరాల తర్వాత కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మొత్తం 51 మంది విద్యార్థులకుగాను 18మంది స్వర్గస్తులు కాగా వారికి నివాళులు అర్పించారు. హాజరైన వారిలో ప్రభాకర్‌రావు, చంద్రశేఖర్‌రావు, భాస్కర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కేశవరావు, కుమారస్వామి, కిషోర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మాచార్యులు, మస్తాన్‌అలీ, సుధాకర్, సుబ్రమణ్యశాస్త్రి, సుబ్బారావు, పుల్లారెడ్డి, సుందరయ్య, సంజీవరావు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, ఏసుపాదం, రామచంద్రుడు వారి బ్యాచ్‌కు గుర్తుగా కళాశాలకు రూ.10 వేలు విలువ గల ప్రింటర్‌ను వితరణగా అందించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి రోజంతా సరాదాగా గడిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రేపటి నుంచి ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో ఆగనున్న బోధన
నాలుగు రోజులుగా ఖమ్మం ధర్నాచౌక్‌లో నిరసన దీక్ష
సమ్మె నోటీసు ఇచ్చాం : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8 : సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిందని, సంవత్సరం పూర్తయిన హామీ అమలు చేయకపోవడం లేదని ఆరోపిస్తూ సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ నెల 10 నుంచి ఎస్ఎస్ఏ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పిలుపునివ్వడంతో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ), యూఆర్ఎస్, భవిత సెంటర్లలో బోధన ఆగనుంది.

టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది కూడా..

ఎస్ఎస్ఏ పరిధిలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అందరూ సమ్మెలో పాల్గొనున్నారు. జిల్లాలో 14 కేజీబీవీల్లో పనిచేస్తున్న 14 మంది స్పెషల్ ఆఫీసర్లు, 105 మంది సీఆర్‌టీలు, 85 మంది పీజీసీఆర్‌టీలు, 165 మంది నాన్ టీచింగ్ సిబ్బంది కలిపి మొత్తం 369 మంది విధులు ఆపేసి సమ్మెలో పాల్గొనున్నారు. వీరితోపాటు జిల్లాలోని

ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్షలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

విద్యాశాఖ పరిధిలోని కార్యాలయాల్లో పనిచేస్తున్న సీఆర్‌పీలు 117 మంది, ఎంఐఎస్‌లు 18 మంది, సీసీవోలు 14 మంది, మెసెంజర్లు 16మంది, పీటీఐలు 136 మంది, డీపీవోలు 22 మంది, ఐఈఆర్‌పీలు 36 మంది కలిపి మొత్తం 359 మంది ఉన్నారు. కేజీబీవీల్లో పాఠాల బోధన నిలిచిపోనుండగా, కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనడం వల్ల టిక్కిల్, ఆన్‌లైన్, యూడైస్, ఎండీఎం బిల్లులు తదితర పనులకు ఆటంకం ఏర్పడనుంది.

తక్షణమే పే స్కేల్ ఇవ్వాలి

తొలుత మండలస్థాయిలో నిరసన దీక్షలు నిర్వహించిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు.. నాలుగు రోజులుగా కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో నిరసన దీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ దీక్షలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన సంఘం రాష్ట్ర నాయకత్వం సమ్మెకు పిలుపునిచ్చింది. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఆలోపు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వారు సమ్మె చేయబోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని నిరసన దీక్షలో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మె చేస్తాం..

ఈ నెల 10 నుంచి విద్యాశాఖలోని సమగ్రా శిక్షా ఉద్యోగులం సమ్మె చేస్తున్నాం. అన్ని రకాల సేవలను నిలుపుదల చేస్తున్నాం. రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఎదురుచూశాం. మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో శాంతియుతంగానే నిరసన దీక్షలు నిర్వహించాం అయిన ప్రభుత్వం నుంచి స్పందన లేదు.
- ఝాన్సీ సౌజన్య, ఎస్ఎస్ఏ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అక్రమంగా మట్టి తవ్వకాలు

- **డంపర్ల ద్వారా తరలింపు**
- **చోద్యం చూస్తున్న అధికారులు**

తిరుమలాయపాలెం, డిసెంబర్ 8 : మండల కేంద్రమైన తిరుమలాయపాలెం రెవెన్యూ పరిధిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ గుట్టలను అడ్డాగా చేసుకొని మట్టి క్వారీలకు తెరతీశారు. తిరుమలాయపాలెం నుంచి ములకలపల్లి వెళ్లే రహదారి పక్కన మూలపడిన గ్రానైట్ క్వారీ సమీపంలోని ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఖమ్మంరూరల్ మండలం ఆరెకోడు గ్రామానికి చెందిన ఓ మట్టి వ్యాపారి అక్రమంగా తవ్వకాలు చేపట్టాడు. రాత్రివేళలో ప్రొక్లైనర్‌తో మట్టిని తవ్వి టిప్పర్లు, డంపర్ల ద్వారా ఖమ్మం నగర సమీపంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. గత నెలరోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తిరుమలాయపాలెం ప్రధాన రహదారి ద్వారానే డంపర్లు, టిప్పర్ల ద్వారా మట్టి తరలివెళ్తున్నప్పటికీ పోలీసులు సైతం పట్టించుకోవడం లేదు. అక్రమంగా మట్టి

ములకలపల్లికి వెళ్లే రహదారి పక్కన ప్రభుత్వ గుట్టల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన దృశ్యం

తవ్వకాలు చేస్తున్న వ్యక్తిపై తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన రైతు ఏగూరి దాసు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు సైతం చేసినా పట్టించుకోవడం లేదు. ఈ మట్టి తవ్వకాల కారణంగా తనకు కొప్పుల ప్రకాశ్‌కు మధ్య ఉన్న భూమికి సరిహద్దు లేకుండా పోయిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. మండలంలోని పిండిప్రోలు, మహ్మదాపురం, కాకరవాయి, జూపెడ గ్రామాల్లో సైతం మట్టి తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండాపోయింది. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు రామకృష్ణను 'నమస్తే' వివరణ కోరగా విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మట్టిని తరలిస్తున్న డంపర్లు, టిప్పర్లను పట్టుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కూచిపూడి జగదీష్ పేర్కొన్నారు.

'ప్రజలతో మమేకమయ్యే వారికే ఆదరణ'

సత్తుపల్లి, డిసెంబర్ 8 : నిత్యం ప్రజలతో మమేకమై ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఏజెండాగా పోరాడుతున్న కమ్యూనిస్టులను ఆదరించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు కోరారు. ఆదివారం సత్తుపల్లిలో ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గంతుక లేనప్పుడు పెత్తందారి వ్యవస్థ బలోపేతమై రాజ్యమేలుతుందన్నారు. ఇప్పటికే దేశంలో మతోన్మాదం పెట్రేగి అన్యమతస్తులను అణగదొక్కే పనిలో ఉందన్నారు. మన దేశంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతున్నదన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే 22వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

కొణిజర్ల, డిసెంబర్ 8 : మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన గుగులోతు సంధ్యకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఆదివారం డీసీసీ ఉమెన్స్ సెక్రటరీ ధర్మసోతు సౌందర్య అందజేశారు. కార్యక్రమంలో ధర్మసోతు కోటేష్, దేవల, బేబీ, చిలికి, నాగమణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

వైరాటౌన్, డిసెంబర్ 8 : వైరా నియోజకవర్గ కేంద్రంలో శ్రీకోదండ రామాలయంలో అయ్యప్ప స్వాముల పీఠం కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్పమాలధారులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసాటి రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న కాపు సంఘం నాయకులు

కారేపల్లి, డిసెంబర్ 8 : మండల పరిధిలోని గేటుకారేపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన పొట్లకాయల వెంకటేశ్వర్లు కుటుంబానికి మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆ సంఘం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. సంఘం జిల్లా నాయకులు అడప పుల్లారావు, పొట్లకాయల రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గమిడి నర్సింహారావు, ముత్యాల సురేశ్, వాకాటి సురేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చౌక దుకాణాలను బలోపేతం చేయాలి

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 8 : పేదలకు ఆహార భద్రత కల్పించే చౌక దుకాణాలను బలోపేతం చేయాలని ఐద్వా మండల అధ్యక్షురాలు యలగం పార్వతి డిమాండ్ చేశారు. చౌక దుకాణాల ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని కోరుతూ ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో సిద్ధారం గ్రామంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చౌకదుకాణాలు కేవలం బియ్యం పంపిణీకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వెంకటకలక్ష్మి, సరోజిని, లక్ష్మి, కుమారి, రేణుక, సుజాత, పద్మ, నాగమణి, రమాదేవి, రాములమ్మ, నాగేంద్ర పాల్గొన్నారు.

సుబ్లేడులో ఉచిత వైద్యశిబిరం

తిరుమలాయపాలెం, డిసెంబర్ 8 : మండలంలోని సుబ్లేడులో ఆదివారం చెవి, ముక్కు, గొంతు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇండో యూఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్యశిబిరాన్ని బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరన్న, మాజీ ఉప సర్పంచ్ వెంకటనారాయణ, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటు ప్రసాద్‌కు నివాళి

మాట్లాడుతున్న అమర్‌జిత్ కౌర్

ఖమ్మం కమాన్‌బజార్, డిసెంబర్ 8: ఇటీవల మృతిచెందిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఆదివారం ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజి పాత భవనంలో జరిగింది. ఆయన చిత్రపటం వద్ద నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ.. పోటు ప్రసాద్ వంటి అమరులైన నాయకుల ఆశయాలను, వారు నేతృత్వం వహించిన పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. వారికి అర్పించగల నిజమైన నివాళి ఇదేనని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పోటు ప్రసాద్ తన తుది శ్వాస వరకు నిబద్ధతతో, నిస్వార్థంతో పార్టీ పురోభివృద్ధికి కృషి చేశారని అన్నారు. సీపీఐ శత వసంతాల జాతీయ స్థాయి ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరో సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు కూడా మాట్లాడారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, గుమ్మడి నర్సయ్య, వివిధ పార్టీల నాయకులు కొండబాల కోటేశ్వరరావు, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, తుమ్మల యుగంధర్, బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలి

ఆహార పదార్థాలను రచి చూస్తున్న సెక్టోరల్ అధికారి రాజశేఖర్

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచాలని, విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి పుష్టికరమైన ఆహారం చాలా అవసరమని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. మధ్యాహ్న భోజన తయారీదారులకు, సహాయకులకు జిల్లా స్థాయి వంట పోటీలను ఆదివారం ఖమ్మంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చక్కగా చదవగలుగుతారని, సృజనాత్మక అంశాలో ముందుంటారని, ఆటపాటల్లో ప్రతిభను చూపగలుగుతారని అన్నారు. ఈ వంట పోటీల్లో విజేతలుగా నిలిచిన జె.తిరుపతమ్మ(ముష్టికుంట్ల హైస్కూల్), నాగమ్మ(లక్ష్మిపురం పీఎస్), వీరలక్ష్మి(ఆరెగూడెం హైస్కూల్)ను అభినందించారు. సీఎంవో యలగందుల రాజశేఖర్, యూఆర్ఎస్ స్పెషల్ ఆఫీసర్ విరిత తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో అవగాహన సదస్సు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాఠశాల యాజమాన్య బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 8: ఖమ్మం, సత్తుపల్లిలోని త్రివేణి పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై ఆదివారం ఖమ్మంలో అవగాహన సదస్సు జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో దీనిని యాజమాన్యం ప్రారంభించింది. వార్షిక పరీక్షలకు సిద్ధమవడం, పాటించాల్సిన జాగ్రత్తలు తదితరాంశాలపై ట్రైనర్ శ్రీనాథ్ అవగాహన కల్పించారు. 2023-24 టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను యాజమాన్యం సన్మానించింది. డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీఆర్‌వో మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ రాజేంద్రప్రసాద్, సరిత, స్వప్న, ముస్తఫా, చార్లెస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ నాయకుల సవాల్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెనుబల్లి, డిసెంబర్ 8 : గడిచిన 15 సంవత్సరాలుగా మూడు పర్యాయాలు సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది ఎవ్వరో ప్రజలకు తెలుసునని, అభివృద్ధిపై మండల కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధం కావాలని పెనుబల్లి మండల బీఆర్ఎస్ నాయకులు సవాల్ విసిరారు. ఆదివారం మండల బీఆర్ఎస్ నాయకులు వంగా గిరిజపతి నివాస గృహంలో మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. పెనుబల్లి, సత్తుపల్లి, కల్లూరు ప్రభుత్వ వైద్యశాలలను 100 పడకలుగా ఆధునీకరించిన ఘనత బీఆర్ఎస్‌ది కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు వెంకట్రావు, లక్ష్మణరావు, అశోక్, సుధాకర్‌రావు, రామారావు, వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, గోవిందరావు, గౌస్‌పాషా, శ్రీను, గౌస్, గిరిజ, శ్రీను, చలపతిరావు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభలను జయప్రదం చేయండి

సభలో మాట్లాడుతున్న బండి నరసింహారావు

వేంసూరు, డిసెంబర్ 8 : సత్తుపల్లిలో డిసెంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించబోయే టీఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభలు, డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో నల్గొండలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ పూర్వరాష్ట్ర కార్యదర్శి బండి నరసింహారావు ఉపాధ్యాయులను కోరారు. ఆదివారం వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేంసూరు మండల శాఖ 11వ మహాసభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి సర్వీసులో కష్టపడి పని చేయాలని కోరారు. మరోసారి ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కే.నిర్మలకుమారి, జీ.ఎస్.ఆర్.రమేష్, ఎస్.కే.నాగుర్‌వలీ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈశ్వరాచారి, కే.వెంకటేశ్వరరావు, కే.శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ

కూసుమంచి, డిసెంబర్ 8 : పాలేరు గ్రామంలో యువతా మేలుకో ఆధ్వర్యంలో అనాథలకు ఆదివారం నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. వీధుల్లో తిరుగుతూ పేదలకు కావాల్సిన వాటిని అందించారు. కార్యక్రమంలో శీలం రామకృష్ణ, సభ్యులు బొంకూరి నాగార్జున, బొబ్బిలి మనోజ్, గోపీ నవీన్, గోపీ వెంకటేశ్, శీలం విఘ్నేష్, శీలం వేణు, దాసరి మహేంద్ర పాల్గొన్నారు.

నారాయణరెడ్డికి నేతల నివాళి

నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం, డిసెంబర్ 8 : మండలంలోని పాతర్లపాడు మాజీ సర్పంచ్ రామసహాయం వెంకటరెడ్డి కుటుంబాన్ని ఆదివారం పలువురు నాయకులు పరామర్శించారు. వెంకటరెడ్డి తండ్రి నారాయణరెడ్డి ఇటీవల మృతిచెందడంతో పలువురు నాయకులు ఆయన చిత్రపటం వద్ద పూలు జల్లి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాసరావు, నరేందర్‌రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

'అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించొద్దు'

మామిళ్లగూడెం, డిసెంబర్ 8: సిటీ పోలీస్ యాక్ట్ అమలులో భాగంగా నగరంలో అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి ఓ ప్రకటనలో కోరారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. వివిధ వర్గాల ప్రజలు, పార్టీలు-సంఘాల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు ఉంటాయని హెచ్చరించారు.